# వనితాలోకం

## ఆత్మవిశ్వాసలోపం

కొమ్మూరి ఉషారాణి

"రాధా! అలా బయటికి వెళదాం వస్తావా? పొద్దస్తమానం యింట్లో కూర్చుంటే నాకు పిచ్చెక్కేటట్లుంది. ఏమీ తోచటంలేదు"

"ఎలా రాను? నీకయితే యింట్లో చేసే వాళ్లున్నారు హాయిగా తిరగగల్గవు నాకు తెల్లారితే యింట్లో పనులతో, వెట్టి చాకిరీతో సరిపోతుంది నే వచ్చేస్తే యింటి పనులు ఎవరు చూచుకుంటారు చెప్పు! అయినా నా ముచ్చటలన్నీ ఎప్పుడో తీరిపోయాయిలే"

అమాట వెళ్లిపోతుంది ఆఅమ్మాయి నిజంగా ఆపిల్ల బ్రతుకు ఎంత హాయిగా వుందో? ఈ పెళ్లి తన స్వతంత్రాన్నీ సౌఖ్యాన్నీ కూల్చేసింది. తన బ్రతుకు తల్చుకుంటే ఆ జన్మాంతమూ అవివాహితురాలిగానైనా వుండవచ్చుగానీ సంసారంలో మటుకు అడుగు పెట్టకూడదని తోస్తుంది. పూరికే అన్నారా పెద్దవాళ్లు, ఆడదై పుట్టటంకంటె, అడవిలో మ్రానై పుట్టటం మేలని, అనుకుంటుంది ఆ యిల్లాలు.

జీవితమంటే ఒక రకమైన దృక్పథం అలవరచుకుని. స్వానుభవాన్ని బట్టి కొన్ని నిర్ణయాలు చేసుకున్న ఆమెకి గృహనిర్వహణం ఒక శ్రమగానూ, తన జీవితం ఒక బానిస జీవితంగానూ తయారవుతాయి. సంసారంపట్ల తన బాధ్యతలని ఎవరో నిర్బంధిస్తున్నట్లుంటుంది, బ్రతుకు తన బానిస బ్రతుకుతో సమానమనుకుంటుంది. భర్త సర్వస్వతంత్రుడనే ఈర్ష్య కలుగుతుంది. ఇక సామాన్య కుటుంబములో అయితే ఆమె వూపిరి తీసుకోవటానికి గూడా వీలులేకుండా యింటి పనులలో మునిగిపోవలసి వస్తుంది. సాంఘిక జీవితంలో పాల్గొనటానికి ఆట్టే అవకాశం వుండదు. ఆ సదుపాయాలు భర్తకి విరివిగా లభిస్తున్నాయనీ, అందువల్ల అతను ఎక్కువ సుఖపడుతున్నాడనీ అనుకుంటుంది అతని ఆనందంలో స్వేచ్ఛలో తను పాలుపంచుకోవటం లేదని బాధపడుతుంది. ఆ బాధే భర్తమీద అసూయగా మారుతుంది.

"వైవాహిక జీవితం పురుషుడికి కొన్ని బాధ్యతలని కల్పిస్తుందనీ, "స్వేచ్ఛ"ని అతనూ కొంచెం వదులుకోవలసి వస్తుందనీ సామాన్యంగా ఆ యిల్లాలు తెలుసుకోలేదు. అతని సంపాదనతో యిల్లు చక్కదిద్దుకోవటములోనూ, గృహనిర్వహణములోనూ ఆనందం చూడలేక కృశించిపోతుంది. ఒకోకప్పుడు పిల్లల పోషణగూడా ఒక భారంకింద తయారవుతుంది. ప్రాపంచిక విషయాలు తెలుసుకోవటానికి అవకాశాలు లేక, యింటిపనులలో మునిగే ఆమె మనసు యిరుగు పొరుగు వారిమీదికి పోతుంది. తన స్థితిగతులని వారితో పోల్చుకుని అసంతృప్తితో బాధపడుతుంది. దానికి కారణం భర్తమీద అసూయా, లోకంపట్ల జీవితంపట్ల ఆమె వైఖరి తన అసంతృప్తికీ దాని వల కలిగే అసౌఖ్యానికీ కారణం తెలుసుకోలేక, దాంపత్య జీవితంలో శాంతికి దూరమైపోతుంది.

* * *

"ఏం! ఇవాళ అలా వున్నావు! ముఖం అదోలా పెట్టావు?"

"ఎలా వుండేమిటి ముఖం? అందంగా లేదా? పొద్దుటినుంచీ పొయ్యిదగ్గిర పడి చస్తుంటే ఎలావుంటాను? కాస్సేపు నడుం వాలుద్దామంటే పిల్లలు ఏదో కొత్త పని కల్పిస్తూ వస్తారు. మీ కేం హాయిగా పొద్దున్నపోయి సాయంత్రం వస్తారు" అని

# ★ ఆత్మవిశ్వాసలోపం ★

దండకం చదువుతుంది ఆ సంభాషణే కాస్త పట్టుతప్పితే చిన్న అంతర్యుద్ధం ప్రారంభమవుతుంది

ఆఫీసునుంచి యింటికి రాగానే భార్య విసుగూ, యిరుగుపొరుగు వారితో పోల్చుకుంటూ అసంతృప్తి ప్రకటించే చేసే విధమూ, అసూయా ఆ భర్తని అయోమయంలో ముంచుతాయి ఆమె ప్రవర్తనకి కారణం ఆమెలో సహజంగా వుండే దుష్టస్వభావమేనని చటుక్కున నిర్ణయించుకుంటాడు ఆమె ద్వేషమూ కాఠిన్యమూ పుట్టుకతో అబ్బినవి కావనీ ఆమె పెరిగిన పరిస్థితుల ప్రభావంవల్లనే ఆమె అలామారిపోయిందనీ గ్రహించడు ఆమెను సరిగ్గా అర్థం చేసుకుని తన సామాజిక జీవితంలోని అనుభవంలో పాలు పంచుకుండా తప్పించుకు తిరుగుతాడు. భర్త అలా తప్పించుకు తిరగటానికి కారణం తనమీద అనురాగం తగ్గిపోవటంవల్లనే అనుకుంటుంది భార్య భర్త జీవితంలో సరిగ్గా పాలుపంచుకోలేకుండా వున్నాననుకునే భార్యకీ, భార్యని తప్పించుకు తిరిగే భర్తకీ మధ్య అగాధం ఏర్పడుతుంది క్రమంగా వారి మనస్తత్వాలకీ, భావాలకి మధ్య గోడలు ఏర్పడి, కష్టసుఖాలని సమంగా పంచుకునే అవకాశం నశిస్తుంది

సామాన్యంగా తనలోగల ఆకర్షణకు కారణం తన మానసిక ప్రవృత్తేనని తెలుసుకోలేని ఆమెకి భర్తమీద అనుమానం, అసూయ ఎక్కువవుతాయి కేవలం రూపంచేతనే అతన్ని ఆకర్షించగలననీ, అది సన్నగిల్లిన కారణంగానే భర్తఅనురాగం తగ్గుతోందనే అపోహ కలగటానికి, చిన్నతనంలో పెద్దలు ఆమె రూపురేఖలమీద చూపే శ్రద్ధే అనుకోవటంలో తప్పలేదు' మానవులు తప్పించుకోలేని కొన్ని జీవిత సమస్యలనీ, తత్ఫలితంగా కలిగే యిబ్బందులనీ, అసౌఖ్యాన్నీ ధైర్యంతో ఎదుర్కొని, జీవితంలో ఆనందం చవిచూడగలిగే స్త్రీయే పురుషుని ఆకర్షిస్తుంది ఆమెకి ఆనందంగా వుండగలిగే శక్తి లేనట్లయితే ఎంతటి సౌందర్యమూ, లావణ్యమూ అయినా సరె భర్తని ఆకర్షించలేవు అవి వ్యర్థం.

ఈ విధమైన కొన్ని అపోహలు కలగటానికీ, జీవిత సమస్యలని గురించి పురుషునికి మల్లే ఆలోచించగలిగే శక్తి లేకపోవటానికీ, ధైర్యాన్ని కోల్పోయి పిరికిగా జీవిస్తూ, తాను ఒక బానిసననీ అస్వతంత్రురాలననీ అనుమానించటానికీ కారణం ఆ స్త్రీకి సమాజంలో జరుగుతున్న అన్యాయమేనని చెప్పవలసి వుంటుంది

* * *

"ఏమమ్మా! మీ అమ్మాయికి యింకా, పెళ్ళి చెయ్యదలచుకున్నట్లు లేదే! ఇంకా చదివించదలచుకున్నారా?"

"లేదండీ! పెళ్లిచెయ్యాలనే వుంది అంతవరకూ యింట్లో పూరికే కూర్చోవట మెందుకు, పోనీ ఈ సరదా గూడా తీరినట్లు వుంటుంది చదివిద్దామన్నారు ఆయన ఉన్నట్లుండి అమ్మాయి పెళ్లివిషయం అడిగారు, మీ పక్క ఏవైనా సంబంధాలు వున్నాయా?"

"లేకేం రెండుమూడువున్నాయి బాగా చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నవారే కానీ పిల్ల చక్కనిదై ఉండాలిట కట్నం గూడా కాస్తో కూస్తో అడుగుతా రనుకుంటాను"

"ఆ! మా రాధకేం! కాస్త పొట్టిగా వుంటుంది అది చక్కనిదని మావాళ్లంతా అంటారు సుమండీ! ఇంటిపనులన్నీ బాగా చేస్తుంది"

పైరకం సంభాషణలు వింటూ, తన వివాహ సమస్యని గురించి యింట్లో కీచులాటలూ, కనపడినవాళ్లందరినీ తల్లి సంబంధాలకోసం వాకబు చేయటం, వెనక్కి తగ్గిన పెళ్లికొడుకులను గురించి జరిగే చర్చలూ, వినే ఆ పిల్లకి యింట్లో తాను ఒక భారమయ్యాననే బెంగా, తల్లిదండ్రులమీద జాలీ సహజంగా కలుగుతాయి అంతస్తు హోదాలమాట అటుంచి, కట్నం భాగవతం గూడా వుంటుంది యిక ఆ పిల్ల మనోవేదన ఎలా వుండగలదో ఊహించటం సులభం ఆదర్శ గృహిణి కావాలనే ఆమె ఊహాసౌధాలన్నీ క్రమంగా కూలిపోతాయి తనకంటె తక్కువ అవకాశాలున్నవారికి ముందు వివాహమైతే, తనమీద తనకే నమ్మకం పోయి, ఎటువంటి పురుషుడైనా వివాహమాడటానికి సిద్ధపడుతుంది తన పెళ్ళి జరగటానికి పెద్దలు చేసే హడావుడీ, పోట్లాటలూ, డబ్బు చిక్కులూ చూస్తే ఎంతైనా పురుషుడు తనకంటె స్వతంత్రుడనీ, సుఖపడగలడనీ అనుకుంటుంది తన పరిస్థితిని చూస్తే అసహ్యము వేయటమే గాకుండా, చుట్టూవున్న వారిమీద జుగుప్స ఏర్పడుతుంది అలాటి వైపరీత్యాన్ని ఆ వాతావరణం కలిగిస్తుంది

ప్రస్తుతం మన సమాజంలో ఆడపిల్లల పెళ్ళి విషయంలో జరుగుతున్న కొన్ని అన్యాయాలూ, తల్లిదండ్రులు చేస్తున్న పొరబాట్లూ వారి పరిస్థితిని నానాటి హీనపరుస్తున్నాయి భావి జీవితానికి సంబంధించిన సమస్యలని ధైర్యంతో ఎదుర్కోవటానికీ, సరైన మార్గాన్న వాటిని పరిష్కరించుకోవటానికీ స్త్రీకి అవకాశం లేకుండా పోతోంది! ఆమె ఆ క్లిష్ట పరిస్థితులనుంచి ముక్తి పొందలేకుండా వుంది. తల్లితండ్రులు కూతురుకి ఆదర్శ జీవితభాగస్థుణ్ణి వెతకటానికి తీసుకునే శ్రమతో, వారి ఉద్దేశాలతో తత్ఫలి




తెనుగుజిల్లాలకు, నైజాముకు ఏజంట్లు
శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు
బెజవాడ. సికింద్రాబాదు

తంగా కలిగే కాలయాపనతో నిమిత్తం లేకుండా ఆ స్త్రీ కొన్ని యిబ్బందులను తప్పించుకోలేకుండా వుంది.

ఇంతే గాకుండా పెళ్ళి యింటర్వ్యూలలో పెద్దలు ఆమె రూపురేఖలమీద చూపే శ్రద్ధ, కేవలం రూపలావణ్యంతోనే తనకి కాబోయే భర్తని రంజింపజేయగలననే భావం కలిగిస్తాయి. ఆ స్త్రీకి. కొంచెం సంస్కారమున్న కుటుంబాలలోని చదువుకున్న యువతులే ఈరోజుల్లో ఆ కష్టాలు తప్పించుకోలేకుండావున్నారు. గుణగణాలతో నిమిత్తం లేకుండా, మానసికవికాసము, ఇతరులతో సంబంధ బాంధవ్యాలలో సహృదయత, చాకచక్యము, సభ్యత, తన నిత్యకర్తవ్యాలలో దక్షత మొదలైనవి అలవరుచుకో నక్కరలేకుండానే చక్కదనమొక్కటే తగిన వరుణ్ణి తెచ్చుకోవటానికి ఉపయోగపడుతుందనే అపోహపడుతుంది. దానితో ఆమె వాస్తవిక విలువలు తారుమారవుతాయి చేస్తుంది. పెద్దలు వివాహ విషయంలో స్త్రీ సౌందర్యానికి ప్రాధాన్యం ఎక్కువగా యివ్వటం మానివేసి, స్త్రీ పురుషుల అన్యోన్య ఆకర్షణని వారికే వదిలివేయటం మంచిది. ఆ "యోగ్యత" ఏదో ఒక్క స్త్రీ నెత్తినే రుద్దటము మూలాన ఆమె భావిజీవితంలో ఎన్నో రకాలైన బాధలకి గురి అవుతుంది.

ఆడవాళ్లకి ధైర్యసాహసాలూ మేధాశక్తీ తక్కువనే వాదన ఒకటి వుంది. ఏపుస్తకం తిరగవేసినా, ఏ సినిమా చూసినా, ఆమె పిరికితనాన్నీ, బేలతనాన్నీ చాటుతూ కొంత ఔదార్యంతోనే ఆమెని విమర్శిస్తున్నారు. కొందరికి అదీ ఒక ముచ్చటగానే వుంటుంది! ఈ ఆరోపణలలోని సత్యాసత్యాల మాట ఎలావున్నా, స్త్రీ పురుషుడికన్నా ఆధిక్యత చూపే సందర్భాలు కొన్ని వుంటాయి.

పురుషుణ్ణి ఆఫీసులో ఎవరైనా కోప్పడితే యింటికివచ్చి పెళ్ళాంమీదా పిల్లల మీదా ఆ విసుగు తీర్చుకుంటాడు. బైట ఎవరితోనైనా మాటకిమాట పెరిగి మనస్పర్ధలు కలిగి దిగులుతో యింటికివస్తే, తల్లియైనా, భార్యయైనా ఉపశమనం కలుగజేస్తారు. చదువు పూర్తయినతరువాత పురుషుడికి నిరుద్యోగసమస్య ఎదురై యింట్లో వుండవలసి వస్తుందనుకోండి! ఇటు తండ్రిగానీ అటు ఉద్యోగం చేస్తున్న అన్నగారుగానీ విసుక్కుంటే, వేరే వెళ్ళిపోతానంటాడు. వెళ్ళిపోగలడు. అలా వెళ్ళినా స్వతంత్రంగా బ్రతగ్గలడు. అతని ధైర్యసాహసాలని స్నేహితులు పొగుడుతారు సమాజం మెచ్చుకుంటుంది. అనునయ వాక్యాలతో శాంతపరచటానికి ఎందరో ముందుకు వస్తారు. కాని స్త్రీ మటుకు బాధాకరంగా వుండే కొన్ని పరిస్థితులలో నుంచీ, అంతకంతకూ దుర్భరమయే వాతావరణంనుంచీ తప్పించుకోవటానికి వీలు వుండటము లేదు. ఆమె తనకి అనుకూలంగా వుండే పరిస్థితులని కల్పించుకోవటానికి గానీ, ఉన్న పరిస్థితిని బాగుచేసుకోవటానికి గానీ అవకాశం లేకుండాపోతోంది. అటువంటి పరిస్థితులనుండి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తే యింటా బయటా గూడా సానుభూతి కనబరచేవారుండరు.

వివాహానికి పూర్వం ఆమె అనుభవించే క్షోభ జీవితంపట్ల ఆమె దృక్పథాన్ని మార్చివేస్తుంది. భావిజీవితంలో తనకి కలగబోయే సౌఖ్యాలలో నమ్మకం నశిస్తుంది. ఆ అపనమ్మకమే ఆమెలో ఒక వింతమనస్తత్వాన్ని కలుగజేస్తుంది. సాంఘికజీవితంలో పాల్గొనటానికీ, జీవితంపట్ల సరైన దృక్పథం అలవరచుకోవటానికి కావలసిన శిక్షణ, విద్య దూరమైపోతున్నాయి. అవి లభించనంతకాలం ఆమె తన హీనపరిస్థితిని బాగు చేసుకోలేదు. కేవలం ప్రణాళికలూ చట్టాలద్వారా సమాన హక్కులని సాధించటమే గాకుండా, విశిష్ట వ్యక్తిత్వం పొందటానికి సమాజంలో తన పరిస్థితిని మార్చుకోవాలి. ఆనాటికి గానీ మనిషికి కావలసిన కొన్ని కనీస సదుపాయాలనీ సౌఖ్యాలనీ పొందలేదు. ఆమె పరిస్థితిలో మార్పువచ్చి, సంఘంలో ఆమెకి తన నిజస్థానం లభిస్తేగానీ, 'బానిసత్వం'నుంచి ఎన్నటికీ విముక్తి పొందలేదు. ★





శుద్ధత కేవలము ప్రకృతి వరప్రసాదము మాత్రము కాదు. అది మానవ యత్నముతో కూడ లభించ గలదు. పకావ్ ప్రభుత్వ నిర్ణీతములకు తగినట్లు, మొదటినుండి చివరివరకు చేతి స్పర్శ లేకుండా తయారయి సీలు చేయబడిన డబ్బాలలో మీకు దొరకును. దాని వలన లాభములు మీరు ఆలోచించుకోండి.

★ బజారు నూనెలు. వేతులతో దానిని కల్తీ చేయుటకు, అపరిశుద్ధము చేయుటకు వీలుకాదు

★ దాని వలన కుటుంబ ఆరోగ్యము పూర్ణ సురక్షితము — డాక్టరు ఖర్చులు లేవన్నమాట

★ అది ఆదాయకరము కూడ. ఎందువలనంటె చవక మిశ్రమములతో మీరు మోసపోరు

పూర్ణ పరిశుద్ధమైన వంటకు వాడే సాధనము

పకావ్ ఎ, డి విటమినులు కలిగినది




ఇండియా పెట్టుబడితో.
ఇండియా నిర్వహణ క్రింద, ఇండియాలోనే తయారవుతున్నది.
టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్ –
TP 153